# ఆచారం

- పి. జీవన జ్యోతి



"ఏం పంతులూ! ఈ యేడు జాతర బ్రహ్మాండంగా ఉండాలే! ఎలా జరిపిస్తవోయేమో?"

"అన్ని యేర్పాట్లూ దివ్యంగ ఉండై! రాజావారేం ఫికర్ జేయనక్కర్లా! ఇంతజామ్ ఏట్లుందో రేపు తమరే జూస్తరుగా!" అంటూ పూజారి శివనాధశాస్త్రి గర్వంగా చూశాడు రాజావారివంక.

"నరే మంచిది! ఇంకెళ్ళి రేపటి తంతుగురించి బాగా చూసుకో! మన గ్రామంల ఆనవాయితీ నీకు యెరికేగా! ఆ రివాజు తప్పేందుకు వీల్లేదు! అర్థమయిందా?"

"చిత్తం! రివాజు తప్పేందుకు మనమెవరం దొరవారూ? పైన దేవతలున్నారు! కింద మనమున్నాం! వాళ్ళకెందుకో ఆగ్రహం కలిగింది! అందుకేయీ కరువు కాటకాలు! పూజా పునస్కారాలు జరిపిస్తునే వుంటిమి! జంతు బలులు యిస్తూనే వుంటిమి! అయినా ఫలితం లేదు!!" అంటూ వాపోయాడు పూజారి.

"ఏది ఏమయినా - రేపు జాతరలో అమ్మవారు ప్రసన్నం గావలెచూడు!" అంటూ లేచారు రాజావారు. వంగి నమస్కరించి సెలవు తీసుకున్నాడు పూజారి.

రాజా నర్సింహారెడ్డి ఆ మండలానికి మకుటంలేని మహారాజు. రాచరికాలు పోయిన యీ రాజాలు పంచాయితీ రాజ్యంలో సుస్థిర స్థానాలు పొంది కొన్నాళ్ళు ఓ వెలుగు వెలిగారు. నర్సింహారెడ్డి ఏ పదవిలోనూ వుండడు; కానీ అన్ని పదవుల వెనుక తానేవుండి పైనుంచి క్రిందవరకు తన మనుషుల ద్వారా అధికారం చలాయిస్తాడు. తన అధికారాన్ని ప్రశ్నించేవారెవరినీ అతడు

ప్రాణాలతో వదిలిపెట్టడు. అదే అతని 'దొరతనం!'

అమాయకురాలైన దొర భార్య అతని దుశ్చర్యల్ని సూటిగా ఖండించినందుకు తన ప్రాణాలే పోగొట్టుకుంది. అతి కాముకుడు, స్త్రీలోలుడు అయిన దొరకు వివాహిత, అవివాహిత అనే భేదం లేదు. అతని కంటబడ్డ ఏ అందమయిన ఆడదీ తప్పించుకుపోలేదు. దొరగారికి సరిగ్గా వారం రోజుల క్రితం జరిగిన ఓ సంఘటన గుర్తొచ్చింది.

సంధ్యా సమయం!

వర్షం! సన్నని తుంపరలతో మొదలయి గాలివానగా మారేట్టు కనబడుతూవుంది. సరుకులకోసం కిరాణా కొట్టుకెళ్ళి వస్తున్న యాదమ్మ దొరగారిమేడ పక్కనున్న కాలిబాట వెంబడి వస్తూవుంది. పాతికేళ్ళ యాదమ్మ తలారి జంగయ్య భార్య. మనిషి నలుపయినా ఆకర్షణీయమైంది.

వర్షంలో తడిసిన యాదమ్మ గాలివానకు భయపడి ఒక్కక్షణం దొరగారిమేడ పక్కన ఆగింది. ఆమె, మేడ పైనుంచి చూస్తున్న రాజావారి గుండెల్లో గుబులు రేపింది. దొర మెల్లగా మెట్లు దిగి వచ్చి చుట్టూ చూసి ఎవరూ లేరని నిర్ధారణ చేసుకుని "బయట వానలో తడిసే బదులు లోపలికి రారాదూ?" అని పిలిచాడు.

యాదమ్మకు భయమేసింది.

"వొద్దు దొరా! నేనీడనే నిలబడతా!" అంది.

"చీర పూర్తిగా తడిసినట్టుండాది!" అంటూనే తన కళ్ళతో ఆమె శరీరాన్ని నిలువునా తడిమాడు.

ఆ కళ్ళను, ఆకళ్ళలోని ఆకలిని చూసి యాదమ్మ అంతా అర్థం చేసుకుంది.

"తడిస్తే తడిసిందిలే!" అంది నిర్లక్ష్యంగా.

"నువ్వేం అనుకోనంటే - నాయింట్లో చాలా చీరలున్నాయి! ఓ పట్టుచీర యిస్తాను! లోపలికి రా!" అంటూ ఆమె నడుం మీద చెయ్యి వేశాడు దొర.

ఆగ్రహంతో యాదమ్మ అతని చెయ్యి విసిరి కొట్టింది. ఉగ్రరూపం దాల్చిన యాదమ్మను చూసి దొర బిక్కచచ్చిపోయాడు.

"థూ!! నీ జిమ్మడ....." అంటూ యాదమ్మ దొర ముఖం మీద తుపుక్కున ఊసి అంతవర్షంలోనూ పరిగెత్తుకుని వెళ్ళిపోయింది.

*   *   *

దుర్గమ్మ జాతర!

తరతరాల మూఢ విశ్వాసాలకు, సనాతన ధర్మానికి చిహ్నంగా మిగిలిన జాతర!

గుట్టమీద వెలసిన 'దుర్గమ్మ'కు అభిషేకం చేయించడానికి దగ్గర్లోనే వున్న కొలనులోంచి కొత్త కడవలతో నీళ్ళు తెస్తారు. గ్రామ ప్రజలంతా ఆ రోజు అమ్మవారికి మొక్కి, తిని, తాగి తందనాలాడి సంబరపడిపోతారు.

దొర, పూజారి యిద్దరూ గుట్టమీదికి వచ్చారు.

"అంతా సిద్ధమేనా?" అనడిగాడు దొర.

"చిత్తం! మన ఆచారం ప్రకారం దుర్గమ్మకు ముడుపు కట్టిన దున్నపోతుల్ని ముందుగా బలి యివ్వాలి!" అన్నాడు పూజారి.

దొర పూజారిని ప్రక్కకు పిలిచి చెవిలో "పంతులూ! బలి యివ్వడానికి తీసుకొచ్చిన దున్నపోతు ఆ సమయంలో అరిస్తే ఆ దున్నపోతుతో బాటూ దాన్ని నరికే మ్యాతరి(తలారి)ని కూడా అమ్మవారికి బలి యివ్వాలి కదూ!!" అన్నాడు గుసగుసగా.

"ఔననుకోండి! అయితే - సాధారణంగా నరికేటప్పుడు దున్నపోతు అరవదు! అంచేత......" అంటూ ఇంకేదో చెప్పబోతుండగా "ఆగు! ఇంకేమీ చెప్పకు!" అని కళ్ళతో సంజ్ఞ చేశాడు దొర.

"అన్నట్టు - మ్యాతరి ఎవరు?"

"తలారి జంగయ్య! తరతరాలుగా ఆ యింటోళ్ళే మ్యాతర్లుగా ఉంటున్నారు! మీకు తెలియందేముంది?" అన్నాడు పూజారి.

"మంచిది! యిక జరగవలసింది చూడండి!" అని దొర గుట్టదిగి వెళ్ళిపోయాడు.

పూజారి ఆదేశం మేరకు కొంతమంది ఆడవాళ్ళు జంగయ్య యింటికి వెళ్ళి తామెందుకు వచ్చామో చెప్పగానే జంగయ్య క్రుంగి పోయాడు.

"నీపెళ్ళాన్ని విధవరాల్ని చేసి కూర్చోబెట్టాలి! అందుకే వచ్చాం! నువ్వేం దిగులు పడమాక! ఇది మామూలుగా జరిగే తంతేగా!" అంది బాగమ్మ తాపీగా తమలపాకు నములుతూ. ఆమె దొర యింట్లో పనిమనిషి.

యాదమ్మ మనసు రోదించింది. ఆ రోదన ఎవరికీ వినిపించదు! అది ఎవరికీ పట్టదు!

"ఏందయ్యాయిది? నువు బతికుండగానే నేను యిదవని గావాల్నా?" అంటూ భర్తని వాటేసుకుని బావురుమంది యాదమ్మ.

"యాదీ! ఇది ఆనవాయితీ గందే! దున్నపోతుని బలిచ్చి నేను తిరిగొచ్చేదాకే గదే యీ యేసం! తర్వాత మళ్ళా పసుపు బట్టలతో అమ్మోరికాడ మనకిద్దరికీ పెళ్ళి జేస్తారే! పెళ్ళి!!" అంటూ సముదాయించాడు జంగయ్య భార్యని.

ఇంకా కాలహరణం యెందుకని బాగమ్మ, జోగమ్మ, యింకా కొందరు ఆడవాళ్ళు కలిసి బలవంతంగా యాదమ్మను ఓపీట మీద కూర్చోబెట్టి ఆమె నొసటి కుంకుమ తుడిచేశారు. ఆమె ఎంత వారించినా వినకుండా వాళ్ళు ఆమె చేతిగాజులు పగలగొట్టారు.

కట్టుకున్న గళ్ళచీర బలవంతంగా లాగేసి తెల్లచీర కట్టబెట్టారు. ఆ దృశ్యాన్ని చూడలేక బయటికి వచ్చాడు జంగయ్య. ఇంట్లోంచి బయటకొచ్చిన జంగయ్యను దొర మనుములు గుట్టమీదికి పిలుచుకుపోయారు.

వీరావేశం కలిగించే ఢమరుకనాదాలు, డప్పుల ధ్వనులతో గుట్టంతా కోలాహలంగా ఉంది. అమ్మవారికి బలులిచ్చే సుముహూర్తం రానేవచ్చింది!

వందలాది గ్రామప్రజలు, భక్తులూ, చూస్తుండగా దున్నపోతుని బలిచ్చేందుకు బండకేసి నూరి పదును పెట్టిన వేటకత్తిని చేతబట్టి వధ్య స్థలానికి వచ్చాడు జంగయ్య. బెదురుచూపులు చూస్తూ నిలబడ్డ దున్నపోతుని చూసి ఓ నిట్టూర్పు విడిచాడు.

"బగమంతుడా! నేను నరికేటప్పుడు యిది అరవకుండా చూడు! చూస్తావుకదూ!" అని మనస్సులోనే ప్రార్థించుకొని, గుండెరాయిచేసుకుని ఒక్కవేటుతో దున్నపోతు మెడ తెగనరికాడు.

కత్తి మెడమీద పడగానే భయంకరంగా అరిచింది దున్నపోతు. జంగయ్య గుండెలవిసి పోయినై. భయభ్రాంతుడయిన జంగయ్యను దొర మనుములు పట్టి పెడరెక్కలు విరిచికట్టారు. నరకబడ్డ దున్నపోతు రక్తంతో ఎఱ్ఱబడ్డ ఆ నేల మరింత రక్తాన్ని కోరుతున్నట్టుగా వుంది.

"పూజారీ! దున్నపోతు అరిచింది గాబట్టి అమ్మవారికి అలక రాకముందే మ్యాతరి జంగయ్యను బలి యివ్వాలె! ఆలస్యమయిందా అపచారం జరుగుద్ది ! అమ్మోరు శపిస్తది!" అన్నాడు దొర.

జనంవైపు చూశాడు, "మీరు మాట్లాడరేం?" అన్నట్టుగా.

"అయితే బలి యియ్యాల్సిందే! యియ్యాల్సిందే!" అంటూ అరిచారు గొర్రెల్లాంటి మూర్ఖజనం.

"మ్యాతరిని నరికేది పూజారి! ఏం పూజారి!" అంటూ అతని వైపు చూశాడు దొర.

"అమ్మో!! క్షమించాలి! నా చేతులు వణుకుతున్నాయి!" అంటూ గజగజలాడిపోయాడు శివనాధశాస్త్రి.

"అయితే - దొరతనం నాకిచ్చిన అధికారంతో నేనే చంపుతాను మ్యాతరిని!" అంటూ మెరుపులా తన జేబులో దాచిపెట్టిన పిస్తోలును బయటికి తీస్తూనే జంగయ్య వైపు గురిపెట్టి కాల్చాడు దొర.

ఆ కాల్పులకు నేల కొరిగాడు జంగయ్య.

తన భర్తకు కీడు శంకించిన యాదమ్మ గుట్టమీదికి పరుగెత్తుకొచ్చింది. ఆమెను చూసి తన శక్తినంతా కూడగట్టుకుని "మోసం! యాదమ్మా! మోసం" అంటూ అరిచి తల వాల్చేశాడు జంగయ్య. క్షణంలో కట్టెగా మిగిలాడు.

అంతా అర్థం చేసుకుంది యాదమ్మ. ఇలా ఎందుకు జరిగిందో, ఎలా జరిగిందో అంతా ఆమె ఊహించగలిగింది.

ఆమె ముఖంలో సంతోషమూలేదు, విచారమూ లేదు. ఆమె మనోభావాలు ఎవరికీ అర్థం కాలేదు. నిర్వికారంగా జంగయ్య వంక చూస్తూ అలా నిలబడిపోయిన యాదమ్మ మనసులో ఏముందో దొరకు అంతుపట్టలేదు.

ఆమె కళ్ళల్లో ఒక మెరుపు!
పెదవులపై ఓ చిరు దరహాసం!

భర్త చనిపోయిన బాధ, చంపిన వాడిమీద కోపం లేకుండా వున్న యాదమ్మను చూసి పూజారి తన మనస్సులో "దీనికి పిచ్చెక్కినట్టుంది! లేదా దొర 'జనానా' లోకి నేరుగా చేరిపోడానికి యీ ఎత్తు ఎత్తిందో!" అనుకున్నాడు.

అక్కడ చేరిన జనాన్ని ఉద్దేశించి యిలా అన్నాడు.

"చూశారుగా! రివాజంటే రివాజే! ఆచారం కోసం బలి అయిపోయిన మ్యాతరి భార్య పాలన, పోషణ భారం రాజావారే యికపై స్వీకరిస్తారు! తన ధర్మాన్ని చక్కగా నెరవేర్చినందుకు దొరగార్ని అమ్మ కరుణిస్తుంది! ప్రసన్నురాలవుతుంది! మనకు శుభం కలుగుతుంది!!"

యాదమ్మ తలెత్తి చూసింది. గుట్ట పైభాగాన చిన్న శివలింగం, చుట్టూ అనేకరాళ్ళు ఉన్నాయి. దుర్గమ్మకు దున్నపోతును బలి యిచ్చిన స్థలం శివలింగానికి చాలా దిగువనే వుంది.

"ఔను! అయ్యోరు సెప్పినట్టుగనే యియ్యాల్నుంచి నేను దొర 'మనిషిని'! నేను ఆయన సొంతం!" అంది యాదమ్మ దొరవైపు క్రీగంట చూస్తూ.

దొర చలించాడు. యాదమ్మ కళ్ళలో ఆహ్వానం! ఆమె తెల్లచీర చెంగు మన్మథ పతాకలా రెపరెపలాడుతోంది.

"దొరా! కడసారిగా జంగయ్యకోసం, తొలిసారిగా మనకోసం శివుణ్ణి మొక్కేందుకు ఆ గుట్ట పైచివరిదాకా పోయొద్దాం! రా!" అని పిలిచింది యాదమ్మ.

ఉబ్బి తబ్బిబ్బైన దొర మారుమాట్లాడకుండా ఆమెను అనుసరించాడు. పూజారి, దొరమనుములు నలుగురు అతన్ని అనుసరించి రాబోగా ఆమె వారించింది. "దుర్గమ్మమీద ఆన! దొరతప్ప ఎవ్వరూ రావొద్దు!!" అంది.

మిగిలిన వాళ్ళంతా అక్కడే ఆగిపోయారు.

కొండరాళ్ళ మధ్య మెట్లతో నిర్మించబడ్డ సన్నని బాట వెంబడి గుట్ట అగ్రభాగానికి చేరుకున్నారు దొర, యాదమ్మ. కిందవున్న జనానికి వాళ్ళు సరిగ్గా కనిపించడం లేదు. ఇంచుమించు శిథిలావస్థలో వున్న ఓ చిన్న

